# మా హవేలీలో కొత్త షికారీ

మహారాష్ట్రలోని అలనాటి మాహోర్ సంస్థానానికి వారసుడు రాజేమధుకర్‌రావ్ దేశ్‌ముఖ్. రావ్‌జీ అనుభవాలు జె.పి. వైద్య మాటలలో....

నాకెందుకో చిన్నప్పటినుంచీ గుర్రాలూ - గుర్రపు స్వారి అంటే చాలా ఇష్టం. బహుశా దానికి కారణం చిన్నప్పటినుంచి మా హవేలీలో ... మా చుట్టూరా గుర్రాలుండేవి అన్నదే కావొచ్చు...

''నేనూ గుర్రం ఎక్కి తిరుగుతానూ!'' అని బాగా ఏడ్చేవాడిని... నాకు కళ్లొచ్చాయి... అంటే కంజెంక్టివైటిస్...! వెలుతురు అస్సలే చూడలేకపోతున్నాను...

అయినా, పెద్దన్నయ్య భావూసాహెబ్, చిన్నన్నయ్య బళ్వంత్‌రావూ అందరూ గుర్రాలెక్కి టపటపా పనుల మీదికెళ్తున్నారు. జమిందారీ వ్యవహారాలు చక్కదిద్దడానికి 'జాగీరు'లో వాళ్లు గుర్రాల మీదే తిరిగేవారు. నిజం చెప్పాలంటే అసలు గుర్రం ఎక్కే వయస్సు కూడా కాదు అప్పటికి నాది. కాని 'షోకు' అన్నది ఒకటి ఉంటది కదా!


చిన్నన్నయ్య నాకన్నా 15-16 సం॥లు పెద్ద. నా గుర్రపు సవారీ సరదాలన్నీ ఆయనే తీర్చాడు. ఆరడుగుల ఎత్తు... తెల్లటి తెలుపు... వెనక్కి దువ్విన నల్లటి కేశాలూ.... మోకాలు దాకా బూట్లు... ఖాకీ ప్యాంట్... నాలుగు జేబులున్న కోటూ... చేతిలో తుపాకీ... మెడలో అడ్డంగా తూటాల ఎద్దిటి హారం... చిన్నన్నయ్య ఎంత అందగాడో అంతే భావుకుడు. చురుకైనవాడు... మంచి షికారీ...

''రాజకుమారులు ఏడుస్తారేమిటీ? పదండి... మనం కలసి గుర్రాన్ని దౌడు చేయిద్దాం'' అని అనునయించాడు.

తల్లిలేని పిల్లవాడినని అందరూ కాస్తంత ఎక్కువే గారబం చేసేవారు.

పెద్దన్నయ్య భావూ సాహెబ్ అంటే జాగీరు అంతటా హడల్...

నాన్నగారు ఎక్కువ మాట్లాడే వారు కాదు. మా ఇంట్లో అందరూ ఆరడుగుల అందగాళ్లే! దానిమ్మ రంగు షాల్ కప్పుకుని దైవత్వం ఉట్టిపడేట్టు కన్పించేవారు నాన్నగారు. పెద్దన్నయ్య కళ్లెత్తి చూసి ''ఊc! వెళ్లిరండి...'' అని చేయి ఊపారు. నాన్నగారు నవ్వారు. ఆయన నేత్రాలు పలికాయి. 'వెళ్లిరండి' అనిమా హవేలి ముందరే మా అశ్వశాల ఉండేది.



చిన్నన్నయ్యకు 'బాండీ' గుర్రం చాలా ఇష్టం. బాండీ గుర్రం కాస్తంత గోగురెరుపుగా, కాస్త తెలుపు, కాస్త నలుపుగానూ ఉంటుంది. దాన్నే 'కబరా' లేదా 'అబులఖ్' అని కూడా అంటారు. ఆంగ్లంలో (PIBALD) పైబాల్డ్ అంటారు. పూర్తిగా ఎదిగిన ఎత్తైన గుర్రం కన్నా 'బాండీ' ఓ పిడికెడు తక్కువ ఎత్తుది. కొంచెం అడ్డంగా, అందంగా ఉంటుంది.

'భురకీ' గుర్రం ఎత్తుగా, పొడుగ్గా, చపలత్వం కల్గి ఉంటుంది. ఒక్కసారి 'రౌతు' దానిమీద సవార్త్తె, 'లగామ్' పట్టుకున్నాడంటే 'దౌడు' ప్రారంభమైందనే అనుకోండి. గుర్రంపై సుదూరాల్లో దౌడు చేయడం ఒక నిషా లాంటిది.

గుర్రాలకు తన 'రైడర్' ఎంత ఘటికుడో వెంటనే అర్థమైపోతుంది. దాని మఖమల్ చర్మం స్పర్శలో 'ధర్...ధర్....' లు ముందుగా తోకలకు తర్వాత మొత్తం శరీరంలోకి పాకి పోతాయి. అశ్వశక్తి శరీరంలో సంచరిస్తుంది. గుర్రం దౌడు తీస్తుంటే వచ్చే నురుగు, చెమ ట... అదీ ఓ నిషా...!

దాని విశ్వాసం పొందడం మజాక్ కాదు. గాజర్, బెల్లం, ఖర్జూరాలు, శనగలు, ఇష్టంగా తింటాయి. అరిచేతికి తేనె పూసుకొని గుర్రం చేత నాకిస్తాడు రౌతు. అది అసలు సిసలు ప్రేమ. దాని నాలుక మఖమలీ స్పర్శ, మెత్తటి పెదవుల స్పర్శ... వేడిశ్వాస... ఇవన్నీ రౌతు-గుర్రం మధ్య ప్రేమ భావాలు...! సౌందర్యం, వేగం, శక్తి, పౌరుషత్వం, నమ్మకం.... ఇవ్వన్నీ మూర్తీభవించి ఉంటాయి గుర్రాల్లో...!

*"There is something about the outside of the horsem, that is good for the inside of the man'* అని ఊరికే అనలేదు.

గుర్రపుస్వారీలో ప్రావీణ్యత పొందితే ప్రపంచంలో ఎంతో సాధించినట్టే...!

''గుర్రపు స్వారీలో మృత్యువు లేదు. కాని, వాయువేగంతో కదంతొక్కే గుర్రంమీది నుంచి ప్రమాదవశాత్తు కిందపడితే బ్రతకడం కష్టం. అలాంటి మృత్యువు స్వాగతార్హం...'' అని కూడా పెద్దలు చెప్తారు.

నేను గుర్రం ఎక్కాలని గొడవ చేసినప్పుడల్లా చిన్నన్నయ్య ఆదుకునేవాడు.. మా హవేలి దర్శనీ దర్వాజా (ప్రధాన ద్వారం) దగ్గర గుర్రాన్ని తెచ్చి నిలిపేవారు. జీన్ కమాన్ను ఎడంచేత్తో పట్టి ఎడమకాలు

'రికేబ్'లో పెట్టి ఒక్క ఉదుటున గుర్రంపై 'బైఠక్' జమాయించేవారు చిన్నన్నయ్య. రెండు పాదాలు రికేబ్‌లో పెట్టి, లగామ్ అందుకోగానే - 'రావ్‌జీ' సయీస్ నన్ను లేపి చిన్నన్నయ్య ముందు జాగ్రత్తగా కూర్చోబెట్టేవాడు. అంతకన్నా జాగ్రత్తగా నన్ను కుడిచేత్తో పొదివి పట్టుకుని ఎడంచేత్తో లగామ్ పట్టుకుని చిన్నన్నయ్య గుర్రాన్ని దౌడు తీయించేవాడు.

మేం 'రమణీ'వైపు మైదానంలో ఐదారు మైళ్లు తిరిగి వచ్చేవాళ్లం. అప్పుడప్పుడు 'రేణుకామందిరం'- 'దత్త్ శిఖరం' వైపున్న అడవుల్లో సంచరించేవాళ్లం. అప్పుడప్పుడు మాహోర్ 'ఘాట్'దిగి పేన గంగా నదీ ఒడ్డున తిరిగేవాళ్లం.

ఇసుకలో గుర్రపుస్వారీ... అదో రకమైన మధురానుభూతి!

ఇసుక తిన్నెలు దాటాక చిన్నన్నయ్య గుర్రాన్ని మోకాళ్లంత లోతు నీళ్లల్లో తీసుకెళ్లి నిల్చేవాడు. గుర్రం నీళ్లు తాగాలని 'లగామ్' వదులుగా పట్టుకునేవాడు. నేను బ్యాలెన్స్ తప్పి ముందుకు జారి పడకుండా జాగ్రత్తగా పొదివి పట్టుకునేవాడు. అది గమ్మత్తుగా చప్పుడు చేస్తూ నీళ్లు తాగేది. నేను ముందుకు వంగి ఆ 'చుర్రక్...చుర్రుక్...' శబ్దాలు వినేవాడిని. నీళ్లు తాగుతున్నంతసేపు గుటకవేసినప్పుడల్లా చెవులు లయబద్ధంగా కదిలేవి. (రాగం-తాళం-పల్లవి... నేర్చుకోవడానికి అది అనువైన చోటు కాదంటారా...?)

నీళ్లు తాగడం పూర్తి అయినా, మా గుర్రం వూరికే నీళ్లల్లో మూతి ముంచి ఆడుకునేది. చిన్నన్నయ్యకు మా 'హవేలీ'లో ఉన్న అన్ని గుర్రాల చేష్టలు బాగా తెలుసు...!

''...హు! చాలు... చాలు...! వేషాలు వెయ్యకు...! నీళ్లు తాగడం అయిందిగా...! ఇంకెందుకు నాటకాలూ?'' అని నావైపు చూసి నవ్వేవాడు.

''నాటకం? ఎక్కడా?'' నాకేం అర్థం కాకపోయినా నేను నవ్వేవాడిని.

చిన్నన్నయ్య శాంతంగా నా మొహం చూసి ప్రేమతో తలనిమిరి హవేలీవైపు దౌడుతీయించేవాడు. ఎవరో ఒకరు నన్ను జాగ్రత్తగా నేలమీదికి దించేవారు. సూరీడు సాయం కిరణాల బంగారు కాంతులు మా హవేలీకి కొత్త అందాలు రంగరించేవి. నాన్నగారు హాల్లో కుర్చీలో ఏదో చదువుతూ కూర్చునేవారు. నన్ను చూసి పుస్తకం మూసి పక్కనే స్టూల్ మీద పెట్టేసేవారు.

నేను గుర్రంలాగే పరుగెత్తుతూ నాన్నగారి ఒళ్లో చేరి ' ఆజ్‌కీ తాజాఖబర్' చెప్పేవాడిని. ప్రతిరోజు నా ఖబర్ అదే అయినా నాన్నగారు ఎంతో అపురూపంగా విని'ఓహో...! అలాగా...!' అని తలనిమిరేవారు.

గుర్రంపై నా మొదటి దూరప్రయాణం 'తులసీ'దాకా!

తులసి... మా జాగీరులోని ఒక గ్రామం. మహా అయితే 10 మైళ్లుంటుంది. షరామామూలే. పది మైళ్ల ప్రయాణం... నా చిన్నప్పటి అందమైన గాథ. మధ్యలో పొలాలూ... దట్టమైన అడవి... రాళ్ల గుట్టలు... లోయలూ... ఉండుండు కుందేళ్లు 'సప్'మని త్రోవకడ్డంగా పరుగెత్తి పొదల్లో దాగిపోయేవి. అనుకోకుండా వచ్చే కుందేలు మా 'భరకీ' గుఱా నికి నచ్చేది కాదు. అది కంగారుగా పక్కకు గెంతేది. చిన్నన్నయ్య తన బ్యాలెన్స్ ఆపేకన్నా నేను పడకుండా జాగ్రత్తపడేవాడు. గుర్రంలాగే కంగారుపడ్డ నా మొహం చూసి గట్టిగా నవ్వేవాడు.

తులసి... దగ్గర చెట్టూ-చేమా లేని చిన్నగుట్ట ఉంది. కొన్ని లేళ్లు గడ్డిమేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతున్నాయి. నేను ఇంకా దగ్గరగా చూడాలని గుర్రాన్ని అటుకేసి తిప్పాడు చిన్నన్నయ్య. అవి బేంబెలెత్తి వంకటింకరగా ఎగురుతూ దూరంగా పారిపోయాయి.

అవి దూరంగా పరిగెత్తుతూ చిన్నవిగా... ఇంకాస్త చిన్నవిగా... కనిపిస్తూ మాయమైన దృశ్యం ఇంకా నా మనోఫలకం మీద తాజాగా ఉంది. చిన్నన్నయ్య గుర్రాన్ని మళ్లీ త్రోవమీదకి మళ్లిస్తూ చెప్పారు.

'అవి చింకారాలు...!'

నేను వెంటనే అడిగేసాను ''వాటిని పట్టుకోవచ్చా వెళ్లి...?''

చిన్నన్నయ్య నవ్వాడు. ''ప్చ్! చాలా కష్టం...! చింకారాలను తరిమి పట్టుకోవడం అంత సుళువు కాదు. పెద్దపులుల షికీర్ చేసే మేటి షికారీలను కూడా అవి ఎంతో తిప్పలు పెడ్తాయి. చెమటలు కక్కించి నిషా తొలగిస్తాయి.''

నా తర్వాతి రోజుల్లో నేను షికార్ చేయడం ప్రారంభించాక చిన్నన్నయ్య అంత నిక్కచ్చిగా ఎందుకో చెప్పాడో నాకు అర్థమైంది.

మా హమేలీ ప్రధాన ద్వారం గుండా లోపలికి వెళ్తే ఇరువైపులా ఎత్తైన నల్లటిరాళ్ల చప్టాలుంటాయి. ఒకవైపు నౌకర్లుండేవారు బైఠక్‌లో. చౌకీదార్లూ


# చిన్నవయస్సులో అధికబరువుతో

# పెద్దవయస్సులో డయాబెటిస్

చిన్న వయస్సులో అధికబరువుతో బాధపడేవారికి
పెద్దయ్యాక డయాబెటిస్ వచ్చే అవకాశాలు చాలాఅధికం
మరిన్ని వివరాలకు వచ్చే వారం ఈ శీర్షిక చదవండి.

ప్రతి శుక్రవారం సాయంత్రం 5-50 ని॥లకు డాక్టరు గారి సలహాలను
మాటీవి 'సంజీవిని' ప్రోగ్రాంలో చూడవచ్చు.

CLINIC 2000
*Makes the difference*

**Himayathnagar :** 203, Sai Datta Arcade
Besides Mitra Agencies Maruti Show Room,
Himayathnagar, Hyderabad-500 029.
Ph : 5566 9595, 5561 5599, 2763 5522 www.clinic-2000.com

**The only Medical Center for Overweight & Laser Hair Removal**

ఉండేవారు కాపలా కాస్తూ.

ఇంకోవైపు బైఠక్‌లో ఒక కర్రతో చేసిన పెద్ద ర్యాక్ ఉండేది.

అందులో రకరకాల తుపాకులుండేవి. చిన్నవీ...! పెద్దవీ...! ఎన్నో...!

గోడమీద అలంకరించినట్టుగా కత్తులూ, కఠార్లూ అమర్చివుండేవి. బల్లాలూ ఉండేవి వరుసగా...!

ఇవన్నీ హవేలీకి సంబంధించినవే...! మా నౌకర్లు చాలా విశ్వాసపాత్రులు...! అక్కడ కూర్చుండి ఎంత లోకాభిరామాయణం చర్చించుకున్నా... ఉబుసుపోక కబుర్లు చెప్పుకున్నా ఆయుధాలను క్రమం తప్పకుండా శుభ్రం చేసి తయారుగా ఉంచేవారు.

బాబూసింగ్, సూరత్‌సింగ్, లద్దూసింగ్, బుధణ్ జమాదార్, రెహమాన్, మెరాజ్ మెహెబూబ్‌ఖాన్, టొహెల్‌సింగ్, రాజా..

మా హవేలీ అంటే వాళ్లకెంత అభిమానమో... మా ఆయుధాలన్నా అంతేప్రేమ! షికార్ సరదా ఉన్నవాళ్లు వాళ్ల తుపాకుల తీసుకుని అడవికెళ్లి కుందేలో, అడవి గొడ్డునో, జింకనో కొట్టి తెచ్చేవాళ్లు.

ఇంట్లో శుభకార్యాలూ, పెళ్లిళ్లూ-పేటాకులూ జరిగినప్పుడు వాళ్ల ఆనందం ఇంతింతా కాదు. తుపాకులెత్తి 'ఢాం... ఢాం...' అని పేల్చేవాళ్లు. అశ్వ శాలలో గుర్రాలు 'ఫుర్... ఫుర్...' అంటూ బిత్తర పోయేవి. కాళ్లకట్లు ఊడిపోయేవి. 'సైసు'లందరు గోలగోలగా ఏకమై...'ఏమిటయ్యా... ఈ ఢాం... ఢాం...లు? గుర్రాలు బెదిరిపోతున్నాయి తెలుసా' అని వాదించేవారు.

మా సిపాయిలు కూడా వినేవాళ్లు కాదు.

''అవునయ్యా... ఢాం... ఢాం...లే! మేం తుపాకుల సంగతి చూసుకుంటాం... మీరు మీ గుర్రాల సంగతి చూసుకోండి... హమ్ నై జాన్తే'' అని మళ్లీ మొదలుపెట్టేవారు ఢాం...ఢాం...లు...!

శుభకార్యాలు ముగిసి ఎన్నో రోజుల దాటిని హవేలీ అంతటా తుపాకీలు పేల్చిన బారూద్ వాసనతో నిండిపోయేది.

ఇంకా చెప్పాలంటే 'బారూద్ వాసన' మా హవేలీ గుర్తింపు అయింది.

అలనాటి నైజాం సర్కార్ మందుగుండు... బారూద్... డ్రమ్ముల కొద్దీ వచ్చేది. సస్తాయి జమానా (రూపాయి విలువ ఎక్కువ) ద్రవ్యోల్బణం ఇప్పుడున్నట్టు ఉండేది కాదు. మామూలు సిపాయి కూడా ఒక జేబులో కాజా, కిస్‌మిస్, బాదాం పప్పు, మరో జేబులో తుపాకి గుండ్లు నింపుకొని తిరిగేవాడు. రెండుజేబుల్లోని వాటినీ సరిగ్గా ఉపయెగించేవాడు.

నిజాం స్టేట్‌లో ఆ రోజుల్లో దుకాణాల్లో షాపింగ్ చేయడం చాలా సులువు. పేము బెత్తం కొనాలా? తుపాకి కొనాలా... అదే ముందు నిర్ణయించుకోవాలి. అంతే... లైసెన్సులు, పర్మిషన్లూ... ఏ కిరికిరీలు ఉండేవి కావు.

మా హవేలీ కొచ్చినట్టే మా వొంటికీ, బట్టలకూ, చెమటకూ మందుగుండు 'బారూద్' వాసనే వచ్చేది. అంత షికార్ సరదా ఉండేది అందరికీ!

మా ఆయుధాల గదిలో తుపాకుల ర్యాక్‌లో నిలబెట్టి ఉంచేవాళ్లు. అందులో ఒకటి మజిల్ లోడింగ్... భర్‌మార్... ఇంగ్లీషు మేక్‌ది! చిన్నన్నయ్య దాన్నెక్కువ వాడేవాడు. కాని, దానివల్ల కొన్ని సమస్యలుండేవి. ఆయన ఎడం చేతి వాటం మనిషి. షికార్ చేసినప్పుడల్లా మందుగుండు చురకలు ఆయన చేతికి తగిలేవి. ఆయన కోసం ప్రత్యేకంగా '12-బోర్‌బ్రీచ్ లోడింగ్ గన్' కొన్నారు నాన్నగారు. ఆ తుపాకి ర్యాక్‌లో నిలబెట్టినప్పుడు మిగతావి కాస్త సిగ్గుపడి తలవంచుకునేవేమో...! అంత అందమైనది ఆ కొత్త తుపాకి.

దాన్ని చూసినప్పుడల్లా నా కన్పించేది. 'నా కంటూ తుపాకి లేదు!' అని. అక్కడున్న తుపాకులన్నీ నా అంత ఉండేవి. చిన్న తుపాకీ అంటూ ఉంటుందా! నా కోసం హవేలీలో అన్నీ స్పెషల్‌గానే ఉండేవి.

నా కోసం ప్రత్యేకమైన కుర్చీ ఉండేది. చిన్న సైకిల్ ఉండేది. 'బాండీ' గుర్రంకన్నా బావుంటుందని నా కోసం ప్రత్యేకంగా 'తేలియా' ఎరుపు గుర్రాన్ని తెప్పించారు. మరి తుపాకీ ఎందుకు ఉండకూడదూ?

తీవ్రంగా ఆలోచించి చిన్నన్నయ్య దగ్గరికెళ్లాను. ఆయన కచేరీలో ఏదో పుస్తకం తిరగేస్తున్నాడు. నన్ను చూసి మరోసారి పుస్తకంకేసి చూసి దాన్ని మూసి పక్కన పెట్టేసారు.

నేను ఆయన దగ్గరకెళ్లి మోకాళ్లమీద చేతులుంచి నిలబడ్డాను.

''... చిన్నన్నయ్యా...''

'' ... ఊc! చెప్పండి...''

నిజాం స్టేట్‌లో ఆ రోజుల్లో దుకాణాల్లో షాపింగ్ చేయడం చాలా సులువు. పేము బెత్తం కొనాలా? తుపాకి కొనాలా... అదే ముందు నిర్ణయించుకోవాలి. అంతే... లైసెన్సులు, పర్మిషన్లూ... ఏ కిరికిరీలు ఉండేవి కావు.

''... నాకో తుపాకి కావాలి...! మీ లాంటిది...''

''... నాలాంటి తుపాకీయా?'' నేను హడావుడిగా తప్పు సరిదిద్దుకున్నాను.

''... మీలాంటిది కాదు... మీ దగ్గర ఉన్న తుపాకి లాంటిది...''

''నా తుపాకీ కావాలా?''

''మీ తుపాకీ కాదు.... ఇంకా చిన్నది... చిన్నది కావాలి.''

ఆయన నా మాటలకు నవ్వి ... ''పదండి...! నాన్నగారిని అడుగుదాం...''

దర్బార్ హాల్ దాటి లోపలికెళ్తే- కుడివైపు ఓ 'చబూత్రా' ఉండేది.

మూడు వైపులా చక్కటి నక్షీపని చేసిన డిజైన్ ఉన్న రాజస్థానీ కళాకృతులున్న 'మెహెరాపి' ఉండేది. పూజ చేసాక నాన్నగారు సాధారణంగా అక్కడే కూర్చునేవారు. దానిమ్మ రంగు కాశ్మీరీ షాల్ కప్పుకొని నాన్నగారు కుర్చీలో కూర్చుని ఉన్నారు.

చిన్నన్నయ్య క్రింద నిలబడ్డారు. (మా నాన్నగారి దగ్గర చిన్నన్నయ్య ఎప్పుడూ కూర్చుండేవాడు కాదు. వినయంగా నిలబడే మాట్లాడేవాడు) నేను మటుకు మెట్లెక్కి నాన్నగారి ఒళ్లో వాలాను. మేమిద్దరం కలిసికట్టుగా వచ్చాం అంటే ఏదో విశేషం ఉందని ఆయన పసికట్టారు. నావైపూ, చిన్నన్నయ్య వైపూ మార్చి మార్చి చూసి '' ఊ! ఇవ్వాళ ఏమిటీ ఇంకా?'' అన్నారు. చిన్నన్నయ్య మెల్లగా చెప్పారు. ''చిన్న తుపాకీ కావాలీ అంటున్నాడు''

'' ఓహో! నిజం... నిజం...! నిన్న గుర్రం వచ్చింది. నేడు తుపాకీ కావాల్సిందేమరి! చూడండి... ఎక్కడ దొరుకుతుందో?

చిన్నన్నయ్య... ''హైదరాబాద్‌లో దొరుకుతాయి నాన్నగారూ....'' అని చెప్పి హడావుడిగా మా లైబ్రరీ నుంచి లావాటి ఓ పుస్తకం తీసుకొచ్చి నాన్నగారి ముందున్న చిన్న టేబుల్ మీద పెట్టాడు.

పేజీలు తిప్పుతూ ఓ చోట ఒక ఫోటో చూపించి ''ఇది చూడండి'' అన్నాడు నాన్నగారు నావైపు చూసి ''మీకు నచ్చిందా!'' అని ప్రశ్నించాడు.

నునుపు కాయితం మీద అందంగా వున్న ఫోటో...! అయినా తుపాకుల గురించి నాకేంతెలుసు? ఫోటోలో తుపాకీ అందంగా, నిగనిగలాడుతూ ఉంది... బస్! అది చాలు నాకు.

''బావుంది...! చాలా బావుంది'' అన్నాను.

కొన్ని రోజులు గడిచాయి.

ఓ రోజు నాన్నగారు పూజగదిలో ఏదో ధర్మగ్రంథం చదువుతూ కూర్చున్నారు. ప్రసాదం రూపంలో 'కేశర్' కలిపిన పాలున్నాయి. వెండి గ్లాసులో! ఆ పుస్తకం పూర్తి కావాలి. అప్పుడే ప్రసాదం నా కడుపులోకి వెళ్తుంది. గ్లాసు కేసి చూస్తూ కూర్చున్నాను.

చిన్నన్నయ్య హడావుడిగా వచ్చి దూరంగా నిలబడ్డాడు.

చేతిలో నీలంగా మెరుస్తున్న సరికొత్త 'చిన్న తుపాకి' ఉంది. నాన్నగారు ఏవో మంత్రాలు ఉచ్చరిస్తున్నారు. కళ్లతోనే నన్ను అడిగారు. 'నచ్చిందా?' అని నేను గబగబా తల వూపాను.

నాన్నగారు నింపాదిగా పూజపూర్తి కానిచ్చి ఎర్రటి వులన్ గుడ్డతో ధర్మగ్రంథాన్ని చుట్టిపెట్టారు. తుపాకిని అందుకున్నారు. పూజగదిలో దీపాలు వెలుగుతున్నాయి. ఆ కాంతిలో తుపాకి ధగధగ మెరిసిపోతున్నది. వెంట చిన్న నీలిరంగు డబ్బా వుంది. బూట్‌పాలిష్ లాంటిది. అందులో చిన్న చిన్న 'ఛర్రా'లున్నాయి.

నేను ఉండబట్టలేక చేత్తో తాకి చూసాను. చల్లగా ఉంది తుపాకి.

అది నా జీవితంలోని మొట్టమొదటి తుపాకి...! లండన్‌లో తయారైన 'టెల్' కంపెనీవారి 'ఎయిర్ గన్'...!

రెండోరోజు నాన్నగారూ, చిన్నన్నయ్య కలిసి నాకు 'తుపాకి పాఠాలు' నేర్పారు. 'బుధణ్ జమాదార్' ఓ పాత చిరుతపులి చర్మం ముక్క తీసుకొచ్చి కిటికీలో తగిలించాడు. తుపాకి 'బట్'ను కుడి భుజానికి ఆనించాను. ఎడం చేయి చాచి తుపాకి మధ్య భాగంలో పట్టుకున్నాను. కుడిచేతి చూపుడు వేలు ట్రిగ్గర్‌పై వుంచాను. గురి చూసాను.

అక్కడొచ్చింది కష్టకాలం. ఒక కన్ను మూయటం నావల్ల కాలేదు. రెండూమూసుకుపోతున్నాయి.

నాన్నగారు నవ్వి నా ఎడం కన్ను మూసారు చేత్తో....!

మళ్లీ గురిచూసి ట్రిగ్గర్ నొక్కాను. ఛళ్లమని చప్పుడైంది. కిటికీలోని చిరుత చర్మం ముక్క కదిలింది.

అదిగాలికి కాదు. నా మొదటిగురికి!! అందరం నవ్వుకున్నాం...! చిన్నన్నయ్య చెప్పాడు ''పొర పాటుగా కూడా తుపాకి ఎవరివైపూ గురిపెట్టకూ'' అని...

తర్వాతి కాలంలో 'నాసిక్'లోని భోస్లా మిలటరీ స్కూల్‌లో 'మస్కెట్రీ ట్రైనింగ్'- టార్గెట్ షూటింగ్‌లో రైఫిల్ చేత పట్టుకున్నప్పుడు మా కమాండర్ చెప్పింది అదే.

''నెవర్ ఎయిమ్ ఎట్ పర్సన్ అన్‌లెస్ యు వాంట్ టు కిల్ హిమ్''

రోజూ నేను ఎయిర్‌గన్ 'ఛర్రాల' పెట్టె తీసుకొని పెరట్లో వెళ్లేవాడిని. పెద్ద పెద్ద ఎత్తైన గోడలుండేవి. అక్కడ ప్రాక్టీస్ చేసేవాడిని. 10-15 రోజుల్లోనే 20 అడుగుల దూరంలో అగ్గిపెట్టెనూ.... ఆ తర్వాత కొన్నాళ్లకు అంతే దూరంలో 'కాణీ' నాణేన్ని గురిచూసి కొట్టేయడం వచ్చేసింది.

ఇంత చిన్న వయస్సులో మంచి గురిచూసి షూట్ చేయడం చూసి నన్ను మా సిపాయిలూ, కొంతమంది షికారీలూ మెచ్చుకోసాగారు.

'హవేలీ'లోని 'రాజా షికారీ' చాలా గొప్ప షికారీ... ఎన్నో పులుల్నీ, చిరుతలనూ షికార్ చేసాడు... మా 'మాహోర్' ప్రాంతంలో తిరుగులేని షికారీ అన్న పేరున్నవాడు.

రోజూ నేను ఎయిర్‌గన్ 'ఛర్రాల' పెట్టె తీసుకొని పెరట్లో వెళ్లేవాడిని. పెద్ద పెద్ద ఎత్తైన గోడలుండేవి. అక్కడ ప్రాక్టీస్ చేసేవాడిని. **10-15** రోజుల్లోనే **20** అడుగుల దూరంలో అగ్గిపెట్టెనూ.... ఆ తర్వాత కొన్నాళ్లకు అంతే దూరంలో 'కాణీ' నాణేన్ని గురిచూసి కొట్టేయడం వచ్చేసింది.

ఉండుండి మా రెహమాన్‌కు అనుమానం వచ్చింది.

''చినబాబుగారు... మనరాజా కంటే మంచి షికారీ అవుతారు'' అన్నాడు.

'' ఆc! రాజా కంటేనా? ఏడీవాడు... పిలవండి'' .... గోల మొదలైంది.

రాజా గుర్రాల శాలలో గుర్రాల మధ్య పడుకొని ఉన్నాడు. ఎవరో వెళ్లి లేపి తీసుకొచ్చారు. అసలు సంగతి చెప్పారు.

రాజా చిన్ననవ్వు నవ్వి.... ''సరే'' అన్నాడు.

20 అడుగుల దూరంలో అగ్గిపెట్టె ఉన్నచోట మైనం ముద్దమీద 'అణా' నాణెం నిలబెట్టారు.

రాజా నవ్వుతూ వచ్చి ఎయిర్‌గన్‌ను చిన్న ఆటబొమ్మలా లేపి గురిచూసి కొట్టాడు. 'ఛెళ్లమని చప్పుడైంది. రాజా నవ్వు మాయమైంది. మైనం ముద్ద మీద 'అణా' సగౌరవంగా నిలబడే వుంది.

రాజా కాస్తంత చిన్న మొహం చేసుకున్నాడు.

ఇప్పుడు నావంతు...!

జాగ్రత్తగా గురిచూసి, ఊపిరి బిగపట్టి ట్రిగ్గర్ ఒత్తేసాను!

'ఛన్న్' మన్న చప్పుడుతో 'అణా' కిందపడి పోయింది. రాజా పరుగెత్తి వెళ్లి ఆ నాణాన్ని అందు కున్నాడు. చేటంత మొహం చేస్తూ మనస్ఫూర్వకంగా నవ్వాడు. అందరూ సంబరంగా నవ్వుతున్నారు.

ఆ నవ్వులూ... గొడవా.... విని చిన్నన్నయ్య మేడదిగి వచ్చాడు...!

'' ఏమిటీ గొడవ?'' అని కళ్లతోనే ప్రశ్నించాడు.

''మాలక్! చిన్నబాబుగారు రాజాను ఓడిం చారు...

ఇదిగోండి... దెబ్బతిన్న అణా'' అన్నారంతా...

''ఓహో! మన హవేలీలో కొత్త షికారీ...!'' అని చిన్నన్నయ్య, మెచ్చుకోలుగా నా వీపు తట్టారు. రాజా ఎంతో జాగ్రత్తగా అపురూపంగా నా ఎయిర్‌గన్‌ను తుడుస్తున్నాడు.

''అణా, కానీలు కాదు... రాజాలా పులినీ, చిరుత పులినీ షికార్ చేస్తే కదా గొప్ప....'' అని నేను నా ఎగిరిపడే మనస్సుకు చెప్పాను....!

– డా॥ జె.పి.వైద్య

# అసలు పళ్ళెందుకు ఊడిపోతాయి ?



## ఆధునిక దంత వైద్యం

డా॥ పి.వి.పార్థసారథి

M.D.S., F.A.A.C.D. (USA)

కాస్మటిక్ డెంటల్ స్పెషలిస్ట్

నోటిలో పళ్ళు లేక పోవడానికి ప్రధానంగా రెండే కారణాలు కనిపిస్తాయి. మొదటిది పిప్పిపళ్ళు. పంటికి రంధ్రం చేసిన పిప్పి ఎనామిల్, డెంటిన్ పొరలను దాటి పల్ప్ అనే పొరను చేరుకొన్నప్పుడు నొప్పి పుడుతుంది. ఈ స్థితిలో కూడా మనం రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్ చేసుకొని, పంటిని కాపాడ వచ్చును. కొంతమంది ఈ స్థితిలో స్పెష లిస్టును కలవకుండా పన్ను తీయించుకుంటారు. మరికొన్ని సార్లు పంటిని పూర్తిగా కాపాడలేని స్థితిలో అంటే పన్ను పూర్తిగా ముక్కలైనప్పుడు తప్పని పరిస్థితులలో తీసేస్తారు.

పన్ను పోవడానికి మరొక కారణం చిగుళ్ళ వ్యాధులు, రోజూ చక్కగా బ్రష్ చేసుకోకపోవడం, గ్రామాలలో అయితే బ్రష్, పేస్టు కాకుండా బొగ్గుపొడి, ఉప్పు వంటి వాటిని ఉపయోగించి పళ్ళు తోముకోవడం వల్ల పళ్ళ మధ్య మురికి చేరుతుంది. ఎవరైనా కూడా పంటిని రెండు సార్లు బ్రష్ చేసుకుంటున్నామని చెప్పే వారితో సహా ప్రతి 6 నెలల కొకసారి దంతవైద్యుని దగ్గరకెళ్ళి పళ్ళు శుభ్రం చేయించుకోవడం తప్పనిసరి. ఇలా కాక కొన్ని సంవత్సరాలపాటు పళ్ళను అశ్రద్ధ చేస్తే పళ్ళ మధ్య చేరుకున్న మురికి లోపలి చిగుళ్ళలో చేరి పంటికి ఆధారంగా ఉన్న ఎముకను నాశనం చేస్తుంది, అప్పుడు పళ్ళు కదులుతాయి, దీనినే పయోరియా అంటారు. ఈ స్థితిలో కూడా వదులైన పళ్ళను తప్పని స్థితిలో డాక్టర్ పీకేస్తారు. ఈ రోజు మనం చూస్తున్న మరో సాధారణ కారణం రోడ్డు యాక్సిడెంట్లు, దెబ్బలు తగలడం. ముఖానికి దెబ్బ తగిలినపుడు ముందు పన్ను దవడ నుండి ఊడి పడిపోతుంది. ఇలా ఊడిన పంటిని కొన్ని గంటలలోపు శుభ్రంగా డాక్టరు వద్దకు తీసుకుపోతే దానినే తిరిగి అమర్చే అవకాశం ఉంటుంది. అలా కాని పక్షంలో కృత్రిమ దంతాన్ని ఊడిన పంటి స్థానంలో అమర్చుకోవాల్సి ఉంటుంది.

### పళ్ళు తీసేయడం వల్ల శరీరంలో ఏవైనా మార్పులొస్తాయా ?

ఏదైనా దవడలో ఒక్క పన్ను తీసేయడం వల్ల ఆవైపు నమిలే శక్తి 25శాతం తగ్గి పోతుందని ఓ అంచనా. అంటే నమిలే శక్తితో పాటు శరీరం తీసుకొనే పౌష్టికాహారం విలువలు కూడా తగ్గుతాయని తద్వారా జీవితకాలం కూడా తగ్గుతుందని ఒక సర్వే చెబుతుంది. మరి శరీరంలో జరిగే మార్పులకొస్తే ఏదైనా ఒక్క పన్ను తీయడం వల్ల తీసిన పక్క పన్ను ఆ ఖాళీ ప్రదేశంలోకి జరిగి పళ్ళ మధ్య సందులేర్పడతాయి. ఖాళీ అయిన పై పన్ను కిందికి జరిగి పళ్ళు అస్థవ్యస్థంగా ఏర్పడతాయి. ఒక పన్ను తరువాత మరొకటి పాడై మిగిలినవి కూడా తీయించుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.

మనం ఏ వైపునయితే పన్ను తీయించు కుంటామో ఆ వైపు నమలడం బాగా కష్టమ వుతుంది. అందువల్ల ఆ వైపు నమలడం మానే స్తాము. నమలడం పూర్తిగా మరోవైపే ఉంటుంది. ఎక్కువగా నములుతున్న వైపు దవడ జాయింట్‌లో మార్పులొచ్చి దీర్ఘకాలిక సమస్యలు ఉత్పన్న మవుతాయి.

ఈ విధంగా చెప్పుకుంటూ పోతే ఎన్నో గ్రంధాలవుతాయి. నేను పైన చెప్పిన సంగతులన్నీ అందరికీ బాగా తెలిసిన విషయాలే.

ఎప్పుడైతే పంటిని తొలగిస్తామో వెంటనే కృత్రిమ దంతాల్ని అమర్చుకోవడం తప్పనిసరి. అక్కడ దంతాల్ని పెట్టుకోవడం కోసం కాకపోయినా మిగిలిన దంతాలను కాపాడుకోవడం కోసమైనా కృత్రిమ దంతాలను అమర్చుకోవాలి. కృత్రిమ దంతాలను సరైన వైద్యుని దగ్గర అమర్చుకుంటే భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కావు.

పార్థ దంత వైద్యశాల
& రీసర్చి సెంటర్
600/44/77, పెద్దకాపు లే ఔట్, శ్రీనివాసం కాటేజస్ ఎదురుగా, తిరుపతి. ఫోన్:0877-2250555, 2250105